క్లుప్తంగా

పింఛను అందజేసిన కలెక్టర్ అరుణ్ బాబు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం పరిశీలించారు. పింఛన్‌దారులతో మాట్లాడి వారి కుటుంబ స్థితిగతులను, సకాలంలో పింఛను అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మండలంలో 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తియినట్లు ఎంపీడీవో పి.పుట్టారెడ్డి తెలిపారు.

ప్రసన్నాంజనేయునికి పూజలు



బెల్లంకొండ: బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం శని త్రయోదశి సందర్భంగా స్వామికి ప్రత్యేక అలంకరణ గావించారు. అభిషేకాలను ఆలయ అర్చకులు అనంతచార్యులు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రేపు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

సత్తెనపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమాలు సోమవారం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి అంబటి రాంబాబు కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. మండలంలో కంటెపూడి గ్రామంలో సోమవారం ఉదయం 8:30 గంటలకు, 9 గంటలకు కొమెరపూడిలో, 10 గంటలకు తాలూకా సెంటర్‌లో, 10:30 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు పాల్గొంటారని తెలిపారు.

మా సమస్యలు ఎవరికి చెప్పాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్



సత్తెనపల్లి: 'రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం అన్నారు.. కలిసికట్టుగా వార్డులు అభివృద్ధి చేసుకుందామని చెప్పారు .. గత సమావేశంలో చెప్పినప్పటికీ తమ వార్డులో సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించలేదు. మా వార్డుల్లో సమ్యస్యలు ఎవరి దృష్టికి తీసుకురావాలి.' అని మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ ప్రశ్నించారు. మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ ప్రస్తావించిన సమస్యకు ఎక్స్ అఫీషియోగా హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్పందించి మాట్లాడుతూ వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను మున్సిపల్ చైర్ పర్సన్ చలనచర్ల లక్ష్మీ తులసికి అందచేయమన్నారు. ఈ సందర్భంగా అజెండాలోని 31 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. ముందుగా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గా న్యాయవాది మద్దినేని వెంకట చలపతిరావు పేరును మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 31వ వార్డు కౌన్సిలర్ తురకా మేరీ గ్రేస్ ప్రతిపాదించగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ బలపరిచారు. మద్దినేని వెంకట చలపతిరావు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మద్దినేని వెంకట చలపతిరావును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, పాల్గొన్నారు.

భారీ వర్షం..స్తంభించిన జనజీవనం



పొంగి ప్రవహిస్తున్న కప్పలవాగు



నందిగామలో లోలెవల్ చప్టాపై నిలిచిన వర్షపు నీరు



నందిగామలో కలెక్టర్ అరుణ్‌బాబుకు పరిస్థితిని వివరిస్తున్న అధికారులు

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. సత్తెనపల్లిలో శుక్రవారం రాత్రి నుంచి మోస్తరు జల్లులతో ప్రారంభమైన వర్షం శనివారం మొత్తం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో వర్షపు నీరు నిలిచింది. నందిగామలోని అమరావతి - సత్తెనపల్లి మార్గం మధ్యలో లో చప్టాపై వర్షపునీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమీపంలోని కాలువ కట్ట తెగి గుడిపూడిలోని శ్మశానం పక్కన ఎస్సీ కాలనీలోకి వరద నీరు ముంచెత్తింది. గృహాల్లోకి నీరు చేరింది.

సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా సగటున 59.11మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముప్పాళ్ల మండలంలో 88.4 మి.మీ., అత్యల్పంగా నకరికల్లు మండలంలో 22.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అమరావతి మండలంలో 64.8మి.మీ., అచ్చంపేట మండలంలో 78.6 మి.మీ., బెల్లంకొండ మండలంలో 63.8 మి.మీ. క్రోసూరు మండలంలో 50.8మి.మీ, పెదకూరపాడు మండలంలో 43.4మి.మీ, రాజుపాలెం మండలంలో 58.6మి.మీ, సత్తెనపల్లి 61.2 మి.మీ. వర్షం పడింది.

మండల పరిధిలోని నందిగామ, పెద్దమక్కెన, గర్నెపూడి గ్రామాల్లో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని సత్తెనపల్లి ఎస్‌హెచ్‌ఓ పోలూరి శ్రీనివాసరావు తెలిపారు. నందిగామ లోలెవల్ చప్టా వద్ద ఆయన మాట్లాడారు. పెదమక్కెన చెరువు తెగి ప్రవహిస్తున్నందున అవసరమైతే తప్ప ఎవరూ బయటికి రావద్దని సూచించారు. ప్రమాదం జరిగితే వెంటనే 100 నంబరుకు, పోలీస్ స్టేషన్‌కి సమాచారమివ్వాలన్నారు.

- **బెల్లంకొండ:** మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం కూడా రోజంతా భారీ వర్షం పడటంతో చెరువులు, కుంటలు నిండిపోయి పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు చేరింది. పల్లపు ప్రాంతాల్లో ఉన్న పత్తి, వరి పంటలు మునిగిపోయాయి. మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలోని నివాసితులు గుడారాలు ధ్వంసం అవడంతో నిరాశ్రయులయ్యారు. గర్భిణి, పది రోజుల క్రితం ప్రసవమైన బాలింత, చిన్నారులు ఉన్నారు. వారిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ షరీఫ్, సర్పంచ్ గడిపర్తి సముద్రం సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఆశ్రయం కల్పించారు.
- **క్రోసూరు:** క్రోసూరులోని బుడగ జంగాల, చెంచు కాలనీల్లో వరద నీరు చేరుకుంది. తక్షణమే రెవెన్యూ అధికారులు వారికి స్థానిక ఎంపీపీ పాఠశాలలో షెల్టర్ ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ చందమామ, నాయకులు అనుముల కోటిరెడ్డి కాలనీ వాసులకు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. తహసీల్దారు కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఎం.షఫీ పరిస్థితిని సమీక్షించారు.
- **క్రోసూరు:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం కారణంగా మండలంలో శుక్రవారం రాత్రి నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. అన్ని గ్రామాల్లో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోలెవల్ చప్టాల మీదగా వరద నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. విప్పర్ల గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల చుట్టూ నీళ్లు చేరాయి. కళాశాలకు సెలవు ప్రకటించారు. ఊటుకూరు వద్ద కప్పలవాగు పొంగి ప్రవహిస్తుండటంతో గుంటూరు నుంచి క్రోసూరుకు (అమరావతి మీదగా) వచ్చే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి.

ఊటుకూరు చప్టాకు అవతల ఊళ్ల ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దొడ్లేరు నుంచి పిడుగురాళ్ల మార్గంలో పెట్రోల్ బంక్ వద్ద ఉన్న లోలెవల్ చప్టా, 88త్యాళ్లూరు నుంచి ఉయ్యందన గ్రామానికి వెళ్లే దారిలోని లోలెవల్ చప్టా, అందుకూరు వద్ద ఎద్దువాగు, పెరికపాడు లోలెవల్ చప్టా వద్ద వరద పొంగి ప్రవహిస్తోంది. దీంతో ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చప్టాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమయ్యారు.

- **రాజుపాలెం:** మండలంలోని గణపవరం, బలిజేపల్లికి మధ్యలో ఎద్దువాగు చప్టాపై వరదనీరు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీని వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఐదు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి ఈ వాగు దాటుకుని రావాలి. మాచర్ల-గుంటూరు రహదారిపై అనుపాలెం చప్టా వద్ద ఎస్‌ఐ వేణుగోపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లారీలను మాత్రమే అనుమతిస్తున్నారు. బలిజేపల్లి చప్టా వద్ద కూడా రాకపోకలను బంద్ చేశారు.

వాగుల ఉధృతి తగ్గే వరకు అంతరాయం ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో ఇళ్లు ఖాళీ చేసి పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లారు. గృహాల్లోని వస్తువులన్నీ తడిచి పోయాయి. ముంపు నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టినప్పటికీ పై నుంచి నీరు వస్తుండటంతో ఇళ్ల మధ్యే నీరు నిలిచిపోయింది. కేజీబీవీ పాఠశాల ఆవరణ వర్షపు నీటితో నిండిపోయింది. పత్తిపంట నీట మునిగింది.



అనుపాలెం వద్ద చప్టా వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ



నకరికల్లులో నీట మునిగిన వరి పొలం



నందిగామ లోలెవల్ చప్టా వద్ద పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు

అమరావతి: వర్షాలకు వాగుల ఉధృతి ఎక్కువగా ఉండటంతో శనివారం అమరావతి నుంచి విజయవాడ, సత్తెనపల్లి, క్రోసూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. పెదమద్దూరు వాగు చప్టాపై సుమారు నాలుగడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. సత్తెనపల్లి రోడ్డులో లింగాపురం వద్ద కంటి వాగు పొంగి రెండు మార్గాల్లోనూ ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. నూనెగుండం చెరువు కట్ట తెగి ధరణికోట గ్రామంలోని జైల్ సింగ్ కాలనీని ముంచేసింది. కాలనీలో లోతట్టు ప్రాంతాలన్ని జలమయం అయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరింది. సాయంత్రం 3గంటల వరకు తమను అధికారులు ఎవరూ పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి వాగు స్థలాలను అక్రమించి ఇళ్లుకట్టుకోవడం వల్లే ఈ దుస్థితి పట్టిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. మండలంలో వాగుల వెంట సుమారు రెండు వేల ఎకరాలకు పైగా పంట పోలాలు నీట మునిగాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి శనివారం 3లక్షల క్యూసెక్కుల నీరు కిందకి వదలడంతో లంక గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. గేదెలను, గొర్రెలను మేపుకునే వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చాల్సి ఉంది. అలాగే లంకలలో పంట పొలాలను సాగుచేసుకుంటున్న వారిని కూడా ఇవతలి వడ్డుకు చేర్చాల్సి ఉంది.



నరుకుళ్ళపాడు వద్ద నీట మునిగిన పత్తి పంట



జైల్‌సింగ్ కాలనీ ఇంటిలోకి చేరిన వరద నీరు

అచ్చంపేట: తుపాను ప్రభావంతో అచ్చంపేట, కొత్తపల్లి, పుట్లగూడెం, చింతపల్లి గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ శనివారం రాత్రి తెలిపారు. వర్షం మరో రెండు రోజులు వాన కొనసాగే అవకాశం ఉన్నందున ఎవరూ కృష్ణానది దరిదాపుల్లోకి వెళ్లొద్దన్నారు. అచ్చంపేటలోని వీరభద్రస్వామికాలనీ, ఎస్టీ కాలనీవాసులకు స్థానిక జెడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో సీఐ వెంకటప్రసాద్ నిర్వాసితులకు భోజనం వడ్డించారు.

అప్రమత్తంగా ఉండాలి

సత్తెనపల్లి: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ, గుడిపూడి, పెదమక్కెన గ్రామాలను ఆయన సందర్శించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు నీరు నిలబడకుండా లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్‌తో పాటు సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె. శ్రీనివాసచక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఉన్నారు.



గోళ్లపాడు ఎస్సీ కాలనీలోని గృహంలోకి చేరిన వర్షపు నీరు



అచ్చంపేట పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసయాదవ్, సీఐ వెంకటప్రసాద్

- **అచ్చంపేట:** మండలంలో వర్ష బీభత్సం సృష్టించింది. శనివారం తెల్లవారుజాము 2 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. 80.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దారు జి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక సినిమా హాలు సెంటర్‌లో రోడ్డుపై సుమారు అర కిలోమీటరు మేర నడుముల లోతు నీళ్లు నిలబడ్డాయి. అచ్చంపేట ఉత్తరం వైపు మాదిపాడు, తూర్పు వైపు అమరావతి, దక్షిణం వైపు సత్తెనపల్లి నుంచి వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మాదిపాడు నుంచి అచ్చంపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోయింది. ఆ సమయంలో బస్సులో 20 మంది విద్యార్థులు, మరో 15 మంది వరకు ప్రయాణికులున్నారు. సీఐ వెంకటప్రసాద్ వెంటనే స్పందించి ట్రాక్టరు ద్వారా వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. సత్తెనపల్లి రోడ్డులోగల వాగులో ద్విచక్రవాహన దారుడు నీటి ప్రవాహానికి చప్టాపై నుంచి కిందపడిపోయాడు. స్థానికులు అతనిని రక్షించారు. అమరావతి నుంచి అచ్చంపేటకు రావలసిన ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో నీళ్లు నిలబడ్డాయి. పత్తి, మొక్కజొన్న పంటలు రాత్రికి రాత్రే నీటపాలయ్యాయి. స్థానిక వీరభద్రస్వామికాలనీ, ఎస్టీ కాలనీలలో వర్షపు నీరు నివాసాలలోకి ప్రవేశించాయి. సకాలంలో స్పందించిన తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ వారికి స్థానిక జడ్పీ హైస్కూలులో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి, భోజనసదుపాయం కల్పించారు. 20 కుటుంబాలకు చెందిన 50మంది వరకు పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. అచ్చంపేటకు మూడువైపుల ఉన్న వాగులపై నీళ్లు ప్రవహించడంతో ఎవ్వరూ వాగులలో దిగకుండా గ్రామ రెవెన్యూ అధికారులను, గ్రామ సహాయకులను కాపలా ఉంచినట్లు తహసీల్దారు శ్రీనివాసయాదవ్ తెలిపారు. అచ్చంపేట పోలీసు సిబ్బంది సహాయంతో భద్రతా ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో పరిస్థితులు బాగానే ఉన్నాయని, ఒక్క అచ్చంపేట మాత్రమే జలదిగ్బంధనంలో కూరుకుపోయిందని చెప్పారు.



మాదిపాడు రోడ్డుపై నీటి ప్రవాహంలో ఆర్టీసీ బస్సు



అచ్చంపేట వాగులో కొట్టుకుపోతున్న ద్విచక్రవాహనదారుడు

- **పెదకూరపాడు:** మండలంలోని అన్ని గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమాయం అయ్యాయి. పెదకూరపాడు - సత్తెనపల్లి, గుంటూరు - పెదకూరపాడు, పెదకూరపాడు-అమరావతి, పెదకూరపాడు-పాటిబండ్ల, లింగంగుంట్ల, పాడపాడు అబ్బరాజుపాలెం, 75త్యాళ్ళూరు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పేరమ్మ వాడు, పాటిబండ్ల వాగు, నీరుకుంట ఎన్నడూలేని విధంగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. 75త్యాళ్లూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ నీట మునిగింది. బీసీ కాలనిలోకి వర్షపునీరు ప్రవేశించింది. కంభంపాడు, బలుసుపాడు వద్ద వాగులు ప్రమాద స్థాయిలో ప్రవాహిస్తున్నాయి. పేరమ్మ వాగులో టాటా మ్యాజిక్ ఆటో కొట్టుకుపోతుండంతో స్థానికులు ట్రాక్టర్ సహాయంతో బయటకు లాగారు. పాటిబండ్ల, లగడపాడు, అబ్బరాజుపాలెం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రైల్వేస్టేషన్ రోడ్డుపై వాగులోని నీరు ప్రమాదంగా పారుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. 8.1 సెంటీ మిటర్లు వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దారు మీసాల దానియేలు తెలిపారు. వాగులు, చప్టాల వద్ద రెవెన్యూ సిబ్బంది కాపల ఉన్నట్లు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ బాలూనాయక్ ప్రజలకు అప్రమత్తం చేస్తున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు.



75 త్యాళ్ళూరులో బీసీ కాలనీలో ఇలా..



పెదకూరపాడులో నీటిలో పత్తి పంట



లగడపాడులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



వెంకటాయపాలెంలో గ్రామ వీధిలో వర్షపు నీరు



నీటిలో ఉన్న క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళశాల



అందుకూరు ఎద్దువాగు వద్ద పరిశీలన



కోసూరు: బుడగజంగాల కాలనీలో సహాయక చర్యలు



బలిజేపల్లి వద్ద ఉధృతంగా ఎద్దువాగు

తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు

క్రోసూరు: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని, తనతో పాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉంటారని, 98491 19654 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్ రూమ్..

క్రోసూరు: క్రోసూరు పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఎం.షఫీ శనివారం తెలిపారు. సహాయక చర్యలకు పోలీసుసిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో 9440 796235 నంబరుకు, జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నంబరు 94407 96184 సంప్రదించవచ్చన్నారు. కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుందని చెప్పారు. 91548 80760, 91548 80761, 94906 19394, 0864 7229999 నంబర్లకు కూడా సంప్రదించాలన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కొలిమి షమ్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఎక్కడైనా చెట్లు విరిగిపడినా, మంచినీటి సమస్య ఏర్పడినా, కాలువలు పొంగి ఇళ్లు నీట మునిగినా సహాయ చర్యలకు 24 గంటలు పురపాలక సంఘ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. 08641-232110 నంబరుకు సంప్రదించాలని చెప్పారు.

తప్పులు తెలుసుకుని సత్ప్రవర్తనతో మెలగాలి

సత్తెనపల్లి: క్షణికావేశంలో చేసిన తప్పులను తెలుసుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సబ్ జైలును శనివారం న్యాయమూర్తుల బృందం సందర్శించింది. సబ్ జైలులో ఉన్న రిమాండ్ ముద్దాయిలను వాళ్లకు అందుతున్న వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నాగ వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను తెలుసుకొని సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. వారికి చట్టపరంగా ఉన్న హక్కులను వివరించారు. అనంతరం అక్కడ ఉన్న పరిసరాలను, ఆహార పదార్థాలను, సరుకుల నాణ్యతను పరిశీలించారు. సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, సత్తెనపల్లి మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ప్రియదర్శిని, సబ్ జైలు సూపరింటెండెంట్ టి.వెంకటరత్నం సిబ్బంది పాల్గొన్నారు.



ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ

సత్తెనపల్లి: నియోజకవర్గంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఒక రోజు ముందుగానే ఇంటింటికి పింఛను నగదు పంపిణీ చేశారు. పట్టణంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గురజాల: సామాజిక పింఛన్లను శనివారం కూటమి పార్టీల నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. నగర పంచాయతీ కమీషనర్ చెన్నయ్య, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఉన్నారు.